క్లుప్తంగా

కృష్ణంరాజు కాలువలో పూడికతీత



మునగపాక కృష్ణంరాజు కాలువలో పూడికతీత పనులు చేపడుతున్న దృశ్యం

మునగపాక: మునగపాక కృష్ణంరాజు కాలువలో పేరుకుపోయిన పూడిక తొలగింపు పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సాగునీటి కాలువ సంఘ ప్రతినిధులు పెంటకోట శ్రీరామమూర్తి, నరసింగరావు, మాజీ జెడ్పీటీసీ మళ్ల సంజీవ రావు, స్థానిక నాయకులు టెక్కలి పరశురామ్, సూరిశెట్టి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అరబుపాలెంలో పైడితల్లి అమ్మవారి పండగ రేపు



అరబుపాలెంలోని పైడితల్లి అమ్మవారు

మునగపాక: మండలంలోని అరబుపాలెంలో మంగళవారం పైడితల్లి అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ప్రతినిధులు తుట్టా వెంకట అప్పారావు, కాకి అప్పలనాయుడు తెలిపారు. ఏటా మే ఆఖరి వారంలో అమ్మవారి పండగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ ఏడాది కూడా గ్రామస్తుల సహకారంతో అమ్మవారి పండగను నిర్వహిస్తున్నామన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. అదే రోజు రాత్రికి గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

పాటిపల్లిలో ఉచిత వైద్య శిబిరం



పాటిపల్లిలో వైద్య సేవలందిస్తున్న వైద్యులు

మునగపాక: ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని పాటిపల్లి సర్పంచ్ ఆడారి కృష్ణవేణి కోరారు. మండలంలోని పాటిపల్లిలో ఆదివారం విశాఖలోని మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న కాలంతో పాటు ప్రజలు కూడా ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. జంక్ ఫుడ్ జోలికి పోకుండా తాజా ఆహారం తీసుకోవాలన్నారు. శిబిరానికి హాజరైన గ్రామ ప్రజలకు వైద్యులు పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆడారి త్రిమూర్తులు, వార్డు సభ్యులు ఆడారి రామకృష్ణ, కొయిలాడ మోహన్, పెద్దలు భీశెట్టి ధనశ్రీను, కొయిలాడ త్రిమూర్తులు, కొయిలాడ సత్యనారాయణ, కాండ్రేగుల సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఉచిత వైద్య పరీక్షలు



పూడిమడకలో ప్రజలకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

అచ్యుతాపురం రూరల్ : మెరైన్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మత్స్యకార గ్రామమైన పూడిమడకలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ(మెరైన్) జి.మధుసూదన్‌రావు పర్యవేక్షణలో వైద్యులు రామకార్తిక్, క్రాంతి కుమార్ గ్రామస్తులకు చికిత్స చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పూడిమడక మెరైన్ పోలీస్ స్టేషన్ సీఐ ఎస్.సింహాద్రినాయుడు, ఎస్ఐ జి.పైడిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మోదకొండమ్మ అమ్మవారి పండగ

రావికమతం : మోదమాంబ అమ్మవారి పండగ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలో కొత్తకోట గ్రామంలో గల మోదమాంబ అమ్మవారి పండగను సేనాపతి వారి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, యువకులు భక్తులు ఉత్సాహంగా జరుపుకొన్నారు. తెల్లవారు నుంచే అమ్మవారికి భక్తులు పసుపు కుంకుమ, చీరలు, సారె పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వామ్మో.. భారీ వాహనాలు

- గ్రామీణ ప్రాంతాల్లో యథేచ్ఛగా రాకపోకలు
- ఎస్ఆర్ఆర్ సంస్థ నిర్వాకంతో శిథిలమవుతున్న రోడ్లు
- పట్టించుకోని అధికారులు



వేంపాడులో వీధి రోడ్లో నుంచి రాకపోకలు సాగిస్తున్న భారీ లారీ



బల్క్ డ్రగ్ పార్క్ కోసం రోడ్డు పనులు జరుగుతున్న దృశ్యం.



సామర్థ్యానికి మించి రాకపోకలు సాగించడంతో శిథిలమైన రోడ్డు

నక్కపల్లి: మండలంలో రాజయ్యపేట సమీపంలో ఏపీఐఐసీ నిర్మిస్తున్న బల్క్ డ్రగ్ పార్క్‌కు మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లను శిథిలం చేస్తున్నారు. సుమారు రూ.1100 కోట్లతో చేపట్టే పనులు దక్కించుకున్న ఎస్ఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ వారు తమ భారీ వాహనాలను సామర్థ్యానికి మించి లోడుతో రాకపోకలు సాగించడంతో గ్రామాల్లో వీధి రోడ్లు ఛిద్రమవుతున్నాయి. ఇప్పటికే రోడ్లన్నీ పాడయ్యాయని, వీటికి మరమ్మతులు చేపట్టకపోగా భారీ వాహనాల రాకపోకలతో మరింత అధ్వానంగా తయారవుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలో రాజయ్యపేట, చందనాడ, అమలాపురం, బోయపాడు తదితర ప్రాంతాల్లో బల్క్ డ్రగ్‌పార్క్ కోసం ప్రభుత్వం ఏపీఐఐసీకి 2 వేల ఎకరాలను కేటాయించింది. ప్రస్తుతం ఇక్కడ బల్క్‌డ్రగ్ పార్క్ పనులు జరుగుతున్నాయి. ఈ పార్క్‌లో పలు రసాయన పరిశ్రమలు వారు ఏర్పాటు చేసే యూనిట్ల కోసం మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సదుపాయాలు, తాగునీరు, వాడుక నీరు, తదితర పనుల కోసం ప్రభుత్వం రూ.1100 కోట్లు కేటాయించింది. ఈ మౌలిక సదుపాయాలు కల్పించే పనులను ఎస్ఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ కాంట్రాక్ట్ దక్కించుకుంది. గత రెండు నెలల నుంచి బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేసే ప్రాంతాల్లో రైతుల నుంచి సేకరించిన భూముల్లో మామిడి, జీడి, కొబ్బరి తోటలను తొలగించి భూమిని చదును చేయడం, గ్రావల్ రోడ్లు వేసే పనులు జరుగుతున్నాయి. గ్రావల్ రోడ్లు పూర్తయ్యాక తారు రోడ్లు వేస్తున్నారు. గ్రావెల్ రోడ్ల కోసం ఏపీఐఐసీ వారు సేకరించిన భూముల్లో ఉన్న కొం...డల్లో గ్రావెల్‌ను కాంట్రాక్టర్లు తవ్వుతున్నారు. బ్లాక్ మెటల్, క్రషర్ బూడిద కోసం పలు ప్రాంతాల్లో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ఇతర ప్రాంతాల నుంచి కూడా బ్లాక్ మెటల్, ఇసుక, సిమెంట్ ఇతర ముడి సరకులను దిగుమతి చేసుకుంటున్నారు. వీటిని సంస్థకు చెందిన భారీ ట్రిపర్లల్లో లోడింగ్ చేసి జాతీయ రహదారి మీదుగా వేంపాడు, పాటిమీద, తమ్మయ్యపేట, చందనాడ మీదుగా రాజయ్యపేట తరలిస్తున్నారు.

సామర్థ్యానికి మించి లోడుతో రాకపోకలు

గ్రామీణ ప్రాంత ప్రజల రాకపోకల కోసం ఏర్పాటు చేసిన ఈ చిన్నపాటి రోడ్లలో సుమారు 70 నుంచి 80 టన్నుల బరువు కలిగిన లోడుతో భారీ వాహనాలు వెళ్తున్నాయి. దీంతో రోడ్లు ఛిద్రమవుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్లు కేవలం 30 నుంచి 40 టన్నుల బరువు కలిగిన వాహనాలు మాత్రమే రాకపోకలు సాగించేందుకు అనువుగా ఉంటాయి. బల్క్ డ్రగ్ పార్క్ పనులు చేపట్టిన కాంట్రాక్ట్ సంస్థకు చెందిన వాహనాలు మాత్రం రెట్టింపు లోడుతో వెళ్తున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. వీటికి తోడు రాజమండ్రి నుంచి రాంబిల్లి వరకు బండరాళ్ల లోడుతో వెళ్తున్న లారీలు కూడా ఇలాగే వెళ్తున్నాయని, పరవాడ ఎన్‌టీపీసీ నుంచి కాకినాడ పోర్టుకు ఫ్లైయాష్‌తో వెళ్లే వాహనాలు కూడా ఇలాగే వెళ్తున్నాయని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు.

భారీ వాహనాలతో భయాందోళన



ఇరుకు రోడ్లో ఇళ్ల మధ్యలో నుంచి భారీ లోడుతో వెళ్తున్న వాహనాలను చూసి గ్రామస్తులు భయపడుతున్నారు. ఇప్పటికే రోడ్లన్నీ పాడైపోయాయి. గోతుల్లో నుంచే ఈ ట్రిప్పర్ లారీలు ప్రయాణిస్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ట్రాక్టర్లు, చిన్నచిన్న లారీలు అయితే పర్వాలేదు. 80 టన్నుల సామర్థ్యంతో పెద్ద లారీల్లో బండరాళ్లు, బ్లాక్ మెటల్, ఇసుక తదితర ముడిసరకు తరలించడం వల్ల భయపడాల్సి వస్తోంది. అధికారులు స్పందించి వీటికి అడ్డుకట్ట వేయాలి.

– సురేష్‌రాజు, వేంపాడు

టోల్ ఫీజుతో అక్రమ మార్గం!

కాంట్రాక్టర్ వాహనాలతో పాటు, బండరాళ్లు, ఫ్లైయాష్ వాహనాలు వేంపాడు టోల్ ఫీజు నుంచి తప్పించుకునేందుకు ఇలా అడ్డదారుల్లో ఇరుకు రోడ్లలో రాకపోకలు సాగిస్తున్నాయంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. కూటమిలో ముఖ్యనేతకు అత్యంత సన్నిహితుడైన వ్యక్తికి చెందిన కాంట్రాక్ట్ సంస్థ కావడంతో అధికారులు కూడా ఈ వాహనాల రాకపోకలపై ఎటువంటి అభ్యంతరాలు వ్యక్తం చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇరుకు రోడ్లలో గ్రామాల మధ్యలో నుంచి భారీ లోడుతో వెళ్లే వాహనాలను చూసి ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. పొరపాటున వాహనం బోల్తాపడితే ఇళ్లపై పడే అవకాశం ఉందని వాపోతున్నారు. అధికారులు స్పందించి గ్రామీణ ప్రాంతాల్లో ఇరుకు రోడ్ల మీదుగా రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

లక్ష్యంతో చదివితే ఉజ్వల భవిష్యత్



పదిలో మెరుగైన మార్కులు సాధించిన విద్యార్థులకు సత్కారం

మునగపాక: లక్ష్యం కోసం చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరావు అన్నారు. ఇటీవల జరిగిన పది పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులతో పాటు ఇదే హైస్కూల్‌లో 1995–96లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల పిల్లలను ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో ఏకాగ్రత ఉండాలన్నారు. ఇష్టపడి, కష్టపడి చదువుకుంటే మంచి ఫలితాలు సొంతమవుతాయన్నారు. హెచ్ఎం శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థులు ఆనంద్‌బాబు, జోగారావు, గిరీష్‌కుమార్, జగ్గప్పలనాయుడు, బాపునాయుడు, హరికుమార్, వెంకటేశ్వరి, పద్మ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి పండగ



సత్తెమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: మునగపాకలో ఆదివారం పలు చోట్ల సత్తెమ్మతల్లి అమ్మవారి పండగలు ఘనంగా జరిగాయి. మునగపాక బీసీ కాలనీని ఆనుకొని ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఇందిరమ్మ కాలనీలో సత్తెమ్మతల్లిని భక్తులు దర్శించుకున్నారు.

ఉత్సాహంగా గుర్రపు పోటీలు



పోటీలో తలపడుతున్న గుర్రం



పూజలందుకున్న అభయాంజనేయస్వామి

ఎస్.రాయవరం: హనుమజ్జయంతిని పురస్కరించుకుని సైతారుపేటలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి గుర్రపు పందేలు ఉత్సాహంగా సాగాయి. గ్రామంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సుమారు 15 మంది తమ గుర్రాలను స్వారీ చేస్తూ ఆకట్టుకున్నారు. ఇందులో అచ్యుతాపురం మండలం రామన్నపాలెం గ్రామానికి చెందిన గుర్రపు స్వారీ దారుడు అప్పారావుకి ప్రథమ బహుమతి రాగా, చోడవరానికి చెందిన గుర్రానికి ద్వితీయ స్థానం లభించింది. తృతీయ, నాలుగో, ఐదో స్థానాల వారికి కూడా నగదు బహుమతి ఇచ్చి ప్రోత్సహించారు. గుర్రపు పందేలు తిలకించేందుకు సైతారుపేట పరిసర ప్రాంతాలైన పేటసూదిపురం, వేమగిరి, సర్వసిద్ధి, జేవీపాలెం, ఎస్.రాయవరం తదితర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



సుందర్యపేటలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేస్తున్న శ్రీనివాస్

అనకాపల్లి: దైవ జ్ఞానం ప్రకారం కులాలు అహేతుకమని, మతాలు నిషిద్ధమని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక విశాఖ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. సుందరయ్యపేట, అచ్చయ్యపేట గ్రామాల్లో త్రైత సిద్ధాంత ప్రబోధ గ్రంథాల ప్రచారాన్ని ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాల ప్రచారం భగవద్గీత గ్రంథం శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానాన్ని తెలియజేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ కర్మ యోగం విశిష్టత, త్రైత సిద్ధాంత జ్ఞానం తెలుసుకోవాలన్నారు. మన శరీరంలో దేవుడు మూడు ఆత్మలుగా విభజింపబడి ఉన్నాడని, జీవాత్మ, ఆత్మ, పరమాత్మల గురించి తెలుసుకోవడమే త్రైత సిద్ధాంతం అని పేర్కొన్నారు. భగవద్గీతలో కర్మయోగం, బ్రహ్మయోగం, భక్తియోగం అనేవి దైవ ధర్మాలని, వాటి ప్రకారం నడుచుకుంటే కర్మ నుంచి బయటపడేసి మనిషికి ముక్తిని ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక విశాఖపట్నం కమిటీ సభ్యులు రమణ, నాగమణి, పద్మ, లక్ష్మి, త్రైత, సర్వధారి, దేవి, సత్యవతి, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న భక్తులు



గవరపాలెం నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



క్యూలైన్లో భక్తులు

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయాన్ని ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఉత్తరాంధ్ర జిల్లా నుంచి, రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి కుటుంబ సమేతంగా చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణంలో కొంతమంది భక్తులు శనివారం రాత్రి అమ్మవారి పాటను నిర్వహించి ఆదివారం తెల్లవారు జామున ఆలయం వద్దకు చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం కుటుంబ సమేతంగా ఆలయం ఆవరణలో చలువ పందిళ్ల వద్ద వంటలు చేసుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో వెంపలి రాంబాబు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వృద్ధులు, బాలింతలు, చిన్నపిల్లలకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు తాగునీరు, ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

సామూహిక పెండ్లిరాట



ఏఎల్‌పురంలో పెండ్లిరాట వేస్తున్న గ్రామస్తులు

గొలుగొండ : సామూహిక వివాహ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఏఎల్‌పురంలో ఉన్న పద్మావతి కల్యాణ పండపంలో పెళ్లి రాట వేశారు. ఈ నెల 30న దాన ధర్మ చారిటబుల్ ట్రస్టు, వికాస తరంగణి సంస్థ ఆధ్వర్యంలో ఆదివాసీల సామూహిక వివాహ మహోత్సవం నిర్వహిస్తామని సంస్థ ప్రతినిధి సూర్య తెలిపారు. 30న ఉదయం పది గంటలకు సుమారుగా 108 ఆదివాసీల జంటలకు వివాహం జరిపిస్తామని తెలిపారు. త్రిదండ శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని సంస్థ సభ్యులు తెలిపారు.

రైతులను గౌరవిస్తేనే మేలు



గోకులపాడులో మహిళా రైతులను సత్కరిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

ఎస్.రాయవరం: దేశానికి వెన్నుముకగా నిలిచే రైతులను గౌరవించినప్పుడే అన్ని వర్గాల వారికి మేలు చేకూరుతోందని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు కర్రి సత్యనారాయణ అన్నారు. గోకులపాడు ఏజే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగంబోయిన నాని పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అడ్డురోడ్డు బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం రూ.లక్ష వ్యయంతో సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భవనాలు వద్ద పలు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పలువురు మహిళా రైతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నాగంబోయిన శ్రీనివాసరావు, తిమ్మాపురం గ్రామ ఉప సర్పంచ్ అద్దేపల్లి బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆర్టీసీ ఉద్యోగుల దీక్షలు



దీక్షలు చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

అనకాపల్లి: ప్రజా రవాణా శాఖ(ఆర్టీసీ) ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కార్మికులు స్థానిక డిపో వద్ద నిర్వహిస్తున్న నిరాహార దీక్షలు ఆదివారం 86వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ సర్క్యులర్ నంబర్.1/2013 అమలు చేయాలని, అధికారులు కార్మికులకు లక్షల్లో ఇస్తున్న పనిష్మెంట్ విధానాలు నిలుపుదల చేయాలని, డిపోలో విధుల నుంచి తొలగించిన కండక్టర్ ఎస్ఎస్ నారాయణన్ని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని తదితర డిమాండ్లు చేశారు. రిలే నిరాహార దీక్షల్లో ఉద్యోగులు ఎ.రమణ, డి.ఆనంద్, జి.ఎస్.రావు, తదితరులు పాల్గొన్నారు.

తురాయి పూల సోయగం




కొరువాడ జగన్నాథపురం మార్గంలో తురాయి పూల స్వాగతం.

కె.కోటపాడు : మండలంలో కొరువాడ జగన్నాథపుపురం- ఆర్.వై.అగ్రహారం గ్రామాల మధ్య రోడ్లకు ఇరువైపులా ఉన్న తురాయి చెట్లు ఎరుపు రంగు పూలతో ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి. రెండు కిలో మీటర్ల పొడవు గల రోడ్డు మార్గంలో గల తురాయి చెట్లకు ఎరుపు రంగుతో పూలు వికసించడంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులను ఈ ప్రాంతం ఆకట్టుకుంటుంది. స్వాగతం పలికేలా తురాయి పూలు దర్శనమిస్తున్నాయి.

దేవరాపల్లిలో భారీ వర్షం



దేవరాపల్లిలో కురుస్తున్న వర్షం



నిండుకుండలా పెద్దేరు జలాశయం

దేవరాపల్లి: దేవరాపల్లిలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి కారు మబ్బులు కమ్మేయడంతో ఉక్కపోత ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసింది. సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో వాతావరణం కూల్‌కూల్‌గా మారింది. దీంతో ప్రజలు ఉక్కపోత నుంచి కాస్తా ఉపశమనం పొందారు. కాగా భారీ వర్షం ధాటికి ప్రధాన రహదారులన్నీ వర్షపునీటితో నిండిపోయాయి. లోతట్టు పంట పొలాల్లో సైతం వర్షపు నీరు చేరింది. వెరసి వేసవి దుక్కులకు ఈ వర్షం ఎంతో ఉపయోగపడుతుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పెద్దేరులో పెరిగిన నీటిమట్టం

మాడుగుల : మండలంలో ఆదివారం సాయంకాలం ఉరుములు మెరుపులుతో భారీ వర్షం కురిసింది. దీంతో పెద్దేరు జలాశయం కేచ్ మెంట్ ఏరియాలో 26 మిల్లీ మీటరులు వర్షం పాతం నమోదయింది. జలాశయం గరిష్ట నీటిమట్టం 137 మీటర్లు కాగా ప్రస్తుతం 135 మీటర్లకు చేరుకుంది. పెద్దేరు ఆయకట్టు 15 వేల ఎకరాలకు సాగునీటికి ఢోకాలేదని, జలాశయం జేఈ సుధాకర్ రెడ్డి తెలిపారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుదల



తాళ్లపాలెం శాఖ గ్రంథాలయంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ డీఎస్పీ ఆనంద్

కశింకోట: విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చి పుస్తక పఠనం చేసి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎక్సైజ్ డీఎస్పీ ఎ. ఆనంద్ కోరారు. మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందించడానికి దోహదంగా నిలుస్తాయన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపైనా శ్రద్ధ చూపాలన్నారు. ఆటలు ఆడటంతో ఆరోగ్యంగా ఉంటారన్నారు. పెద్దలను గౌరవించాలన్నారు. నీతి, నిజాయితీతో మెలగాలన్నారు. క్రమశిక్షణ, దేశ భక్తి కలిగి ఉండాలన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా నీతికథల పుస్తకాలను చదివి వాటిలో సారాంశాన్ని వివరించారు. విద్యార్థులతో నీతి కథల పుస్తకాలను చదివించారు. గ్రంథాలయ అధికారి కె. జగన్నాథం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

కళా రంగాన్ని ప్రోత్సహించడం అభినందనీయం



నాటికలను ప్రారంభించి మాట్లాడుతున్న పరమేశ్వరరావు

కశింకోట: కశింకోటలో కళా రంగాన్ని ప్రోత్సహిస్తూ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటికలను నిర్వహించడం అభినందనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు అన్నారు. స్థానిక గవరపేటలో ఆదివారం నిర్వహించిన నాటిక పోటీలను ప్రారంభించారు. నాటక రంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అశోక్ ఫ్రెండ్స్ క్లబ్ సాంస్కృతిక కళా పరిషత్ అధ్యక్షుడు బొడ్డేడ బలరామస్వామి, ఉపాధ్యక్షుడు ఆళ్ల మహాలక్ష్మినాయుడు, ప్రధాన కార్యదర్శి మారిశెట్టి దేవినాయుడు, నాటక న్యాయ నిర్ణేత భీమరశెట్టి వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.